క్లుప్తంగా

ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులు

ముమ్మిడివరం: మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు బోధనా పటిమను మెరుగుపర్చుకోవాలని ముమ్మిడివరం జెడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం సీహెచ్ పరిమళ అన్నారు. ఆంగ్ల ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన బి.శ్రీనివాసరావు దంపతులను పాఠశాల ఆవరణలో బుధవారం పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడుగా శ్రీనివాసరావు అందించిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పదవ తరగతి పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులను అభినందించారు.

పారదర్శకంగా రీ సర్వే ప్రక్రియ

అమలాపురం రూరల్: రెండవ దశ రీసర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులంతా కృషి చేయాలని ఆర్డీఓ కే.మాధవి తెలిపారు. బుధవారం అమరావతి నుంచి భూపరిపాలన ముఖ్య కమిషనర్ కార్యాలయం కార్యదర్శి ఎన్. ప్రభాకర్‌రెడ్డి, వివిధ జిల్లాల ఆర్డీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రెండో దశ రీ సర్వే అవగాహన పెంపొందించారు. ఆర్డీఓ మాధవి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో మాట్లాడుతూ భూయాజమాన్యం సరిహద్దుల ప్రస్తుత స్థితిని ప్రతిబింబించేలా ఈ రికార్డులను నవీకరించడానికి రీ సర్వే దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు కే. ప్రభాకర్‌రావు, తాహసీల్దారులు, రీసర్వే అధికారులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు అమ్మ చెంతకు

అమలాపురం టౌన్: ముమ్మిడివరానికి చెందిన బాలుడు దేహాన్(5) అమలాపురంలో బుధవారం సాయంత్రం తప్పిపోయాడు. తన అమ్మ, మామయ్యతో బాలుడు కారులో వచ్చాడు. గడియారం స్తంభం సెంటరులో ఓ షాపులో వస్తువులు కొనుగోలు చేస్తున్న సమయంలో బాలుడిని కారులోనే ఉంచి వెళ్లారు. ఇంతలో కారు డోరు తీసుకుని రోడ్డు మీదకు వచ్చిన బాలుడికి తల్లి అచూకీ తెలియక తిరుగుతున్న సమయంలో స్థానికులు గుర్తించి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పావు గంట తర్వాత బాలుడి తల్లి, మామయ్య వెతుక్కుంటున్న సమయంలో పిల్లోడు పోలీస్‌స్టేషన్‌లో ఉన్నాడని ఎవరో సమాచారం ఇవ్వడంతో వారు స్టేషన్‌కు వచ్చారు. పోలీసులు బాలుడిని తల్లికి అప్పగించడంతో కథ సుఖాంతమైంది. ఈ విషయాలను పట్టణ సీఐ పి.వీరబాబు బుధవారం రాత్రి తెలిపారు.

అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

అల్లవరం: అత్తింటి వేధింపులు తాళలేక డి.రావులపాలెంలో వివాహిత భీమాల అనుసూయ దేవి (35) బుధవారం మధ్యాహ్నం పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పురుగుమందు తాగి అపస్మారక స్థితిలో ఉన్న అనుసూయదేవిని బుధవారం అమలాపురంలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలి తల్లి ముమ్మిడివరం మండలం చయ్యేరు గున్నేపల్లి శివారు దేవరపల్లికి చెందిన యాళ్ల లక్ష్మీనరసింహం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తిరుమలరావు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం అత్త, కోడలికి మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో అనుసూయదేవి ఆత్మహత్యకు పాల్పడిందని లక్ష్మీనరసింహం ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అక్రమ మద్యం వ్యాపారి బైండోవర్

అమలాపురం రూరల్: అమలాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అమలాపురం మండల భట్నవెల్లిలో అక్రమంగా యానాం లిక్కర్ అమ్మకాలు నిర్వహించే ఒక వ్యక్తిని బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. యానం మద్యం అమ్మకాలు నిర్వహించే భట్నవిల్లికి చెందిన పాత ముద్దాయిని సబ్బతి ప్రభుదాస్ తహసీల్దార్ వద్ద బుధవారం హాజరు పరిచి సెక్షన్ 129 బీఎన్ఎస్ చట్టం ప్రకారం బైండోవర్ చేసినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు

యానాం: స్థానిక విద్యుత్‌సబ్‌స్టేషన్‌లో సాంకేతికపరమైన పనులు చేస్తున్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం కాకినాడ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వార్షిక మరమ్మతుల దృష్ట్యా యానాం 11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. అప్పటికే విద్యుత్‌ను నిలిపివేయకుండా పనులు చేయడానికి కనకాలపేటకు చెందిన కాలా సుబ్రహ్మణ్యం సబ్‌స్టేషన్ ట్రాన్స్‌ఫార్మర్లపై భాగం పైకి ఎక్కాడు. ఈ నేపథ్యంలో అతడు విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని కాకినాడ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం వల్లే జరిగిందని స్థానికులు ఆరోపించారు.

బెల్టు షాపుపై దాడి

కాట్రేనికోన: వేట్లపాలెం మావుళ్లమ్మ జాతర సందర్భంగా అనధికారికంగా నిర్వస్తున్న బెల్టు షాపుపై దాడి చేసిన పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసారు. కాట్రేనికోన ఎస్సై అవినాస్ తెలిపిన వివరాల ప్రకారం 180 ఎంఎల్ 464 మద్యం బాటిళ్లు, 108 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అనధికారికంగా బెల్టు షాపు నిర్వహిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసామన్నారు.

పది పరీక్షల్లో సత్తా చాటిన విద్యార్థులు


ఎస్ జాహ్నవిలక్ష్మీ (587)


జే.అనూష (582)


వీహెచ్ఎన్ సందీప్ (578)


జహ్నవి నాగ సాయి గణేశ్వరి (596)


బడుగు శ్రీరక్షిత (582)


రేవు సురేంద్ర (582)


పరమట రోహిణి (579)


పి.నాగవైష్ణవి (584)


అక్కల జ్యోషికాశ్రీ సూర్య (583)

అల్లవరం: పదవ తరగతి ఫలితాల్లో మండలం వ్యాప్తంగా 92 శాతం ఉత్తీర్ణత సాధించారని అల్లవరం మండల విద్యా శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం విడుదల చేసిన పదవ తరగతి ఫలితాల్లో కొమరగిరిపట్నం ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎస్. జాహ్నవి లక్ష్మీ 587 మార్కులతో ప్రథమ, ఎస్.శృతి, కె హారిక 584 మార్కులతో ద్వితీయ, కట్టా కుసుమ ప్రియ 577 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. అల్లవరం మండలంలో 618 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 570 మంది ఉత్తీర్ణత సాధించారు. 74 శాతం ఉత్తీర్ణతతో గోడిలంక హైస్కూల్ చివరి స్థానంలో నిలిచింది.

ముమ్మిడివరం మండలంలో ..

ముమ్మిడివరం: పదవ తరగతి పరీక్షల్లో మండలంలో 96.25 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలో 828 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 797 మంది ఉత్తీర్ణత సాధించి 96.25 శాతం ఉత్తీర్ణత నమోదైంది. వీరిలో బాలురు 460 మందికి 445 మంది బాలికలు 368 మందికి 352 మంది ఉత్తీర్ణత సాధించారు. ముమ్మిడివరం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని జె.అనూష 582, గాడిలంక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి వీహెచ్ ఎన్ సందీప్ 578, గాడిలంక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్‌వీ రవీంద్ర 576 మార్కులు సాధించి మండలంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన సీహెచ్ గున్నేపల్లి, కొత్తలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలు నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈఓలు ఆర్. ఉదయ్ భాస్కర్, జి.గౌరిశంకర్ తెలిపారు.

'పది'లో సత్తా చాటిన విద్యార్థులు

అమలాపురం టౌన్: పదో తరగతి పరీక్షల ఫలితాల్లో స్థానిక శ్రీ వాగ్దేవి స్కూలు విద్యార్థిని పిచ్చిక జహ్నవి నాగ సాయి గణేశ్వరి 600 మార్కులకు 596 మార్కులు సాధించింది. డి.లిఖిత్ నాయుడు, ఎం.ప్రవీణ్య 593 మార్కులు సాధించారు. స్థానిక శ్రీచైతన్య స్కూలు విద్యార్థిని టి.మధు చంద్రిక 597, భాష్యం స్కూలు విద్యార్థి బీఎస్ఎస్ మణికంఠ విశ్వాస్ 596, గొల్లగూడెంలోని ఆదిత్య స్కూల్లో విద్యార్థిని ఎన్.కౌశికి 593, స్థానిక సర్ సీవీ రామన్ స్కూలు విద్యార్థిని జి.సంజనదేవి 591 మార్కులు సాధించారు.

అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థిని లాస్య 587 మార్కులు సాధించిందని ప్రధానోపాధ్యాయురాలు ఎస్. రాజ రాజేశ్వరి తెలిపారు.

జిల్లా ద్వితీయ స్థానంలో కాట్రేనికోన మండలం

కాట్రేనికోన: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పది తరగతి పరీక్షా ఫలితాల్లో 98 శాతం ఉత్తీర్ణత సాధించి కాట్రేనికోన మండలం ద్వితీయ స్థానం సాధించింది. మండలంలో 8 ప్రభుత్వ, 3 ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన మొత్తం 595 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 581 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండలంలో కందికుప్ప జెడ్పీహెచ్ పాఠశాలకు చెందిన బడుగు శ్రీరక్షిత 582 మార్కులు సాధించి మొదటి స్థానంలో, బెథానీ హైస్కూల్ విద్యార్థిని మట్టపర్తి లక్ష్మి 580 మార్కులతో ద్వితీయ స్థానంలో, గచ్చకాయల పోర జెడ్పీహెచ్ పాఠశాలకు చెందిన కె మైథిలి తృతీయ స్థానంలో నిలిచింది.

తాళ్లరేవులో 75.24 శాతం నమోదు

తాళ్లరేవు: టెన్త్ ఫలితాలలో తాళ్లరేవు మండలం 75.24 శాతం ఉత్తీర్ణత సాధించింది. మండలంలో 1,276 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరుకాగా, 960 మంది ఉత్తీర్ణులైనట్లు విద్యాశాఖ అధికారులు ఏ.మంగాయమ్మ, మోకా ఉమ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 68.52 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. టెన్త్ ఫలితాల్లో మండల టాపర్లుగా ప్రైవేటు పాఠశాలలనుంచి 594 మార్కులతో పినపోతు హనిదుర్గ రవిప్రసాద్, ప్రభుత్వ పాఠశాలల నుంచి 582 మార్కులతో రేవు సురేంద్ర(పటవల జెడ్పీ హైస్కూల్) నిలిచారు.

బాలురు 89.83 శాతం, బాలికలు 89.71 శాతం ఉత్తీర్ణత

అమలాపురం రూరల్: మండలంలో మొత్తం 2,161 విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా వీరిలో బాలురు 1,025 మంది, బాలికలు 915 మంది మొత్తం 1,940 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురు 89.83 శాతం, బాలికలు 89.71 శాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఈవో సరేళ్ల కృష్ణవేణి తెలిపారు. వన్నెచింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పరమట రోహిణి 579 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. అదే పాఠశాలలో చదువుతున్న గుమ్మలూరి శ్రావ్య శ్రీ 565 మార్కులు, నక్కా హర్షిత 553 మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలలో మొత్తం 97శాతం ఉత్తీర్ణ సాధించారు. ఇందుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. చొల్లంగి సాయి లాస్య 554, కర్రి అజయ్ 548, సంజన 545 మార్కులు సాధించారు. పరీక్షలు రాసిన 53 మంది పాసయ్యారని హెచ్ఎం విత్తనాల శ్రీనివాసరావు తెలిపారు.

ఐ.పోలవరం మండలంలో.. 97.65 శాతం ఫలితాలు

ఐ.పోలవరం: పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో మండల పరిధిలో ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి 97.65 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈవోలు వి.సురేష్ బాబు, ఎన్.కొండారెడ్డి బుధవారం తెలిపారు. 641 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 626 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి పి.నాగవైష్ణవి 584 మార్కులు (జెడ్పీహెచ్ఎస్ జి.వేమవరం)మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవగా, వీవీ సతీష్ 576 (జెడ్పీహెచ్ఎస్ కేశనకుర్రుపాలెం) ద్వితీయ స్థానం, వీబీ సత్యశ్రీ 574 మార్కులు (జెడ్పీహెచ్ఎస్ ఐ.పోలవరం) మూడవ స్థానంలో నిలిచారు.

యానాంలో 98శాతం పాస్

యానాం: పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో యానాం రీజియన్‌లో 98 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని బుధవారం ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ తెలిపారు. రీజియన్ ప్రథమస్థానాన్ని తలాటం సహస్రా 594 మార్కులు, ఎస్‌జే దుర్గాసాయిలక్ష్మీ 590 మార్కులతో ద్వితీయస్థానాన్ని, కోడూరి నారాయణ మౌనిక 589 మార్కులతో తృతీయస్థానాన్ని సాధించారన్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

ఉప్పలగుప్తం: మండలంలో 8 జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 556 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరుకాగా 541 మంది ఉత్తీర్ణత సాధించి 97 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు మండల విద్యాశాఖాధికారులు కె.కిరణ్‌బాబు, ఎస్.సత్యకృష్ణ తెలిపారు. గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు అక్కల జ్యోషికా శ్రీ సూర్య 583 మార్కులు సాధించి మండల ప్రథమం, గణిశెట్టి శేష పద్మ వైష్ణవి 580 మార్కులతో ద్వితీయ స్థానం, గణిశెట్టి కరుణ శ్రీసాయి సౌజన్య 573 మార్కులతో మండలంలో మూడో స్థానం సాధించారని తెలిపారు.

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి సత్కారం

అమలాపురం టౌన్: అమలాపురం బార్ అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నికైన కార్యవర్గ ప్రతినిధులను పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యాపారులు స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం ఘనంగా సత్కరించి అభినందించారు. బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు చింతపల్లి అజయ్ కుమార్, కార్యదర్శి దొమ్మేటి వెంకటేశ్వరరావు, కోశాధికారి నందెపు చిన్న వెంకటేశ్వరరావు తదితరులకు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో సత్కరించారు. చాంబర్ ముఖ్య సలహాదారు కంచిపల్లి అబ్బులు, చాంబర్ కార్యదర్శి అనుపోజు శ్రీనివాస్, కోశాధికారి దొమ్మేటి సాయి బాబు, ఉపాధ్యక్షుడు మోకా వెంకట సుబ్బారావు, బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు, మాజీ అధ్యక్షుడు చింతలపూడి సత్తిబాబు, ద్వారంపూడి సత్యనారాయణరెడ్డి తదితరులు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రతినిధులను సత్కరించారు.


బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

'సాక్షి' కార్యాలయంపై దాడి దారుణం

- అమలాపురంలో పాత్రికేయుల నిరసన
- ఆర్డీవో మాధవికి వినతి పత్రం అందజేత

అమలాపురం టౌన్: దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆయన అనుచరులు జిల్లా కేంద్రం ఏలూరులోని ×సాక్షి₹ కార్యాలయంపై టీడీపీ మూకల దాడి ఘటనను అమలాపురం పాత్రికేయులు ముక్తకంఠంతో ఖండిస్తూ బుధవారం నిరసనకు దిగారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఆర్డీవో కొత్త మాధవికి వినతిపత్రం అందజేశారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఏపీయూడబ్ల్యూజే జాతీయ సభ్యుడు ఎమ్మెన్వీ ప్రసాద్, ఏపీయూడబ్ల్యూజే ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకరప్రసాద్, అమలాపురం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొండేపూడి సత్యనారాయణ, అమలాపురం సాక్షి స్టాఫ్ రిపోర్టర్ నిమ్మకాయల సతీష్, పాత్రికేయులు అరిగెల రుద్ర శ్రీనివాస్, కట్టా మురళీ, నల్లా విజయ్‌కుమార్, విజయ్ తదితరులు ఆర్డీవోకు వినతి పత్రం అందించారు.


ఆర్డీవో మాధవికి వినతిపత్రం అందజేస్తున్న అమలాపురం పాత్రికేయులు

విశాఖ వెళ్లి గర్భిణికి రక్తదానం

అమలాపురం టౌన్: అరుదైన బ్లడ్ గ్రూపు అయిన బొంబాయి గ్రూపు రక్తాన్ని స్థానిక శ్రీ స్వామి వివేకానంద యోగాశ్రమంలో శిక్షణ పొందుతున్న ఏఎల్ సురేష్ బుధవారం విశాఖపట్నం వెళ్లి రక్తం అత్యవసరమైన ఓ గర్భిణికి అందించారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ కూర్మన్నపాలెం ఏ ప్లస్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఓ గర్భిణికి బొంబాయి గ్రూప్ బ్లడ్ అత్యసరమైంది. కాకినాడలోని ఆమె బంధువులు ఆ అరుదైన బ్లడ్ గ్రూపు కోసం అన్వేషిస్తూ స్థానిక శ్రీ స్వామి వివేకానంద యోగాశ్రమ గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్‌ను సంప్రదించారు. ఆ బ్లడ్ గ్రూపు గల యోగాశ్రమంలోని సురేష్‌ను వెంటబెట్టుకుని యోగాశ్రమ గురువు డాక్టర్ శ్రీనివాస్ విశాఖపట్నంలోని హాస్పిటల్‌కు వెళ్లి గర్భిణికి రక్తదానం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. యోగా గురువు డాక్టర్ శ్రీనివాస్‌కు, రక్తదాతకు గర్భిణీ బంధువులు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే రోజు అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణులకు రక్తం అత్యసరమైతే యోగాశ్రమానికి చెందిన ఇద్దరి వ్యక్తులు అత్యవసరంగా రక్తదానం చేశారని యోగా గురువు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు.


విశాఖపట్నంలో రక్తదానం చేస్తున్న సురేష్, చిత్రంలో యోగా గురువు డాక్టర్ శ్రీనివాస్

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

అమలాపురం టౌన్: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని డీఈవో డాక్టర్ షేక్ సలీమ్ బాషా అన్నారు.

పలు జిల్లాస్థాయి పురస్కారాలతో పాటు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అమలాపురంలోని వెత్సావారి అగ్రహారం మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బందా రత్నాకర్ కామేశ్వరరావు సేవలు అభినందనీయయని ఆయన కొనియాడారు. కామేశ్వరరావు ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక క్షత్రియ కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన వీడ్కోలు సభకు డీఈవో బాషా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తాను పనిచేసిన పాఠశాలకు కామేశ్వరరావు ఉద్యోగ విరమణ సందర్భంగా రూ.60 వేలు విరాళం అందించారు.

యూటీఎఫ్, ఎస్‌టీయూ యూనియన్లకు చెరో రూ.20 వేలు చొప్పను విరాళాలు ఇచ్చారు. ఇదే పాఠశాలలో పనిచేసిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు యర్రమల్లి పాండురంగారావు పాఠశాలకు రూ.25 వేలు అందజేశారు. డీఈవో బాషా మాట్లాడుతూ 39 ఏళ్లుగా ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా కామేశ్వరరావు నిబద్ధతగా పనిచేశారని గుర్తు చేశారు. ఉపాధ్యాయ వృత్తికి న్యాయం చేస్తూనే బుర్ర కథ కళాకారుడిగా రాష్ట్రవ్యాప్తంగా 1,700 ప్రదర్శనలు ఇచ్చిన కామేశ్వరరావు అందరి ఆదరాభిమానాలు పొందరని కొనియాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన కామేశ్వరరావు వీడ్కోలు సభకు పూర్వపు విద్యార్థులతోపాటు ఆయనతో కలసి పనిచేసిన ఎంఈవోలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, డీఈవో బాషా హాజరై ప్రత్యేకంగా అభినందించి ఘనంగా సత్కరించారు. డీవైఈవో గుబ్బల సూర్యప్రకాశం, విద్యాశాఖ విశ్రాంత ఆర్జేడీ డి.వెంకట సుబ్బయ్య, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్లు కల్వకొలను ఛాయాదేవి, నల్లా విష్ణుమూర్తి, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పి.జాన్‌పాల్, సముదూరి కృష్ణమూర్తి, డాక్టర్ గొలకోటి రంగారావు, డాక్టర్ కె. శ్రీమన్నారాయణ ప్రసంగించారు. ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న కామేశ్వరరావుకు 24వ తేదీ నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు ఇవ్వడంతో వారం రోజుల ముందుగానే పాఠశాలలో వీడ్కోలు సభను నిర్వహించారు.

ప్రమాదకర ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించాలి

అమలాపురం రూరల్: నాలుగేళ్లుగా తరచూ ప్రమాదాలు సంభవిస్తున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి రహదారి భద్రత చర్యలను శాఖల సమన్వయంతో బలోపేతం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ జిల్లా రహదారి భద్రతా కమిటీ సభ్యులకు సూచించారు బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారులు రాష్ట్ర అంతర్గత రహదారులపై ప్రమాదాలు పొంది ఉన్న ప్రాంతాల్లో శాఖల సమన్వయంతో కారణాలను గుర్తించి ఆయా ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు, లైటింగ్ ఏర్పాటు ప్రమాదాలు నియంత్రించేందుకు అవసరమైతే కొత్త ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయడం లేదా ఉన్న వాటిని మెరుగుపరచడం చేయాలన్నారు.రావులపాలెంలో ట్రాఫిక్ నియంత్రణకు ఫ్లైఓవర్ నిర్మాణానికి వచ్చే సమావేశం నాటికి పూర్తిగా అధ్యయనం చేసి నివేదిక సిద్ధం చేయాలని ఎన్‌హెచ్ అధికారి సురేంద్రనాథ్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ బీ. కృష్ణారావు,ఆర్అండ్‌బీ ఎస్ఈ బీ.రాము, సాంకేతిక ఇంజనీర్ సత్య, ఆర్టీవో శ్రీనివాసరావు, దుర్గారావు దొర మున్సిపల్ కమిషనర్ పీఆర్ఆర్ రాజు పాల్గొన్నారు.


జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ఇసుక నిల్వలను స్టాక్ యార్డులలో భద్రపరచాలి

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో వర్షాకాలంలో భవన నిర్మాణ రంగ అవసరాలకు సరిపడా ఇసుక నిల్వలను స్టాక్ యార్డుల్లో భద్రపరచాలని కమిటీ సభ్యులను కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతిపాదించిన పలు అంశాలపై కమిటీ సభ్యులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టీ.నిషాంతి, గోదావరి హెడ్ వర్క్స్ఈఈ కాశీ విశ్వేశ్వరరావు, భూగర్భ గనుల శాఖ సహాయ సంచాలకులు తదితరులు పాల్గొన్నారు.

అమాయక పర్యాటకులపై కిరాతక చర్య

అమలాపురం టౌన్: జమ్ము కాశ్మీర్‌లోని పహల్గాం వద్ద పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ ఖండించారు. అమయాక పర్యాటకులపై జరిపిన ఈ దాడిని కిరాతక చర్యగా ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఖాదర్ అమలాపురంలో బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. దేశ సమైక్యతను దెబ్బతీసే ఉగ్రవాద చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనే ఉపేక్షించకూడదని ఆయన పేర్కొన్నారు. ఘటనలో మృతి చెందిన వారి ఆత్మ శాంతి చేకూరాలని ఆయన ప్రార్థించారు.

మృతులకు కొవ్వొత్తులతో నివాళి

అమలాపురం టౌన్: జమ్ము కాశ్మీర్‌లో ఉగ్రవాదుల చేతిలో హతమైన మృతులకు స్థానక గడియారం స్తంభం సెంటరులో విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ ద్వారా నివాళులర్పించారు. విశ్వ హిందూ పరిషత్, భజరంగ్ దళ్ ప్రతినిధులు శిరంగు నాయుడు, ఊటుకూరి సాంబయ్య, కర్రి పార్థసారధి,యక్కల బ్రహ్మేష్, దాట్ల వెంకట సుబ్బరాజు, కురసాల వీరబాబు, గంగుమళ్ల దొరబాబు పాల్గొన్నారు.

గుండెపోటుపై అవగాహన సదస్సు

అల్లవరం: ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో విజయ్ కటకం పార్ట్ ఫౌండేషన్, బీవీసీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో గుండెపోటుపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మహేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విజయ్ కటకం పార్ట్ ఫౌండేషన్ సీఈఓ వడ్లాన కిరణ్ వివిధ అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వర స్వామి ఆలయంలో మే 1 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు బుధవారం ఆవిష్కరించారు. ఐదు రోజుల పాటు శైవాగ పండితులు బ్రహ్మశ్రీ యనమండ్ర సత్య సీతారామ శర్మ ఆధ్వర్యంలో అత్యంత శాస్త్రోక్తంగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. మే 1 న బ్రహ్మోత్సవ కల్యాణం వైభవంగా నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ, అర్చకులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల ధ్వంసంపై కఠిన చర్యలు తీసుకోవాలి

అమలాపురం టౌన్: అల్లవరం మండలం ఓడలరేవులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీలను కొందరు దుండగులు ధ్వంసం చేసిన ఘటన వెనుక పోలీసుల పూర్తి వైఫల్యం ఉందని కోనసీమ దళిత ఐక్య వేదిక చైర్మన్ డీబీ లోక్ ఆరోపించారు. ఈనెల 13న అర్ధరాత్రి తర్వాత జరిగిన ఈ ఘటనలో దోషులు దొరికినప్పటికీ రాజకీయ కారణాలతో ఈ వ్యవహారాన్ని నిర్వీర్యం చేశారని పేర్కొన్నారు. స్థానిక అరిగెల పాలంలో బుధవారం జరిగిన దళిత ఐక్యవేదిక ముఖ్య నాయకుల సమావేశంలో లోక్ మాట్లాడారు. వేదిక కన్వీనర్ జంగా బాబూరావు మాట్లాడుతూ కులాల మధ్య చిచ్చు పెట్టేలా పోలీసులు తీరు ఉందని ఆరోపించారు. ఫ్లెక్సీలను ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సమావేశం డిమాండ్ చేసింది. దళిత ఐక్య వేదిక నాయకుడు రేవు తిరుపతిరావు తదితరులు సమావేశంలో ప్రసంగించారు.

'దిశ'లో ప్రస్తావన అంశాలను పరిగణనలోకి తీసుకోరా..!

సమావేశంలో కొత్తపేట ఎంపీపీ గంగాధరరావు

కొత్తపేట: జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సభ్యులు ప్రస్తావించే అంశాలను పరిగణలోకి తీసుకోరా? జవాబుదారీ లేదా? అటువంటప్పుడు ఈ సమావేశాలు ఎందుకు? సమస్యలు ప్రస్తావించడం ఎందుకు? అని కొత్తపేట ఎంపీపీ మార్గన గంగాధరరావు వాపోయారు. ఎంపీ చైర్మన్‌గా, జిల్లా కలెక్టర్ కన్వీనర్‌గా దిశ కమిటీలో ఎమ్మెల్యేలతో పాటు ఎంపీపీలు సభ్యులుగా ఉన్నారు. ఇది ప్రతి 3 నెలలకు ఒకసారి సమావేశం జరగాలి. కానీ ఆ విధంగా జరగడం లేదు. లాస్ట్ మీటింగ్ గత ఏడాది అక్టోబర్ 30న జరగ్గా మళ్లీ దాదాపు ఆరు నెలల తరువాత నిర్వహించారు. ఎంపీ, దిశ చైర్మన్ గంటి హరీష్ మాదుర్ అధ్యక్షతన కలెక్టర్, దిశ కన్వీనర్ ఆర్. మహేష్‌కుమార్ పర్యవేక్షణలో బుధవారం అమలాపురం కలెక్టరేట్‌లో జరిగిన దిశ సమావేశంలో ఎంపీపీ మార్గన గంగాధరరావు పలు అంశాలను వారి దృష్టికి తీసుకువెళ్లారు. గత ప్రభుత్వంలో సభ్యులు ప్రస్తావించిన అంశాలకు జవాబుదారితనం ఉండేదని, ఇప్పుడు అది ఎక్కడుందని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి శూన్యమని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి కృషి ఫలితంగా మంజూరైన డయాలసిస్ సెంటర్ నిర్మాణం పూర్తి చేయాలని ఎంపీపీ మార్గన కోరారు. ఓఎన్‌జీసీ నిధులు మంజూరు చేయించగా భవన నిర్మాణం పూర్తికాగా ఈలోపు ఎలక్షన్ రావడంతో బిల్లులు చెల్లించలేదని, దాంతో ఆ పనులు నిలిచిపోయాయని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. మండల పరిధిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంవత్సరానికి హెచ్‌డీఎస్ ఫండు రు.5 లక్షలకు పెంచాలని, నైట్ వాచ్‌మన్ పోస్టుల నియామించాలని కోరారు. ఉపాధి హామీ పథకంలో పనులను ప్రతిపాదించే అధికారం పాలకవర్గానికి ఇవ్వాలని కోరారు. బీసీ కార్పొరేషన్ వ్యక్తిగత రుణాలు మంజూరులో ప్రమేయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.


అమలాపురం దిశ సమావేశంలో సమస్యలు ఏకరవు పెడుతున్న ఎంపీపీ గంగాధరరావు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

అంబాజీపేట: ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని హెచ్ఎం కడలి సాయిరామ్ అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ ఆధ్వర్యంలో బడి బాట ర్యాలీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. పాఠశాల నుండి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. స్టాఫ్ సెక్రటరీ వెన్నపు సత్యనారాయణ, పీడీ ఆదిలక్ష్మి, పీఈటీ అంది సూర్యకుమారి పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలగా గూడపల్లి యూపీ స్కూల్

మలికిపురం: గూడపల్లి గ్రామ కొప్పిడి వారి మెరక యూపీ పాఠశాల జెడ్పీ ఉన్నత పాఠశాలగా అప్ గ్రేడ్ అయినట్లు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సుందర శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం గ్రామంలో పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇక్కడ 9, 10 తరగతులు కూడా నిర్వహిస్తారన్నారు. సుందర బ్రహ్మయ్య, కటికిరెడ్డి గోపాల కృష్ణ, సత్యనారాయణ, సుందర బల్లబ్బులు పాల్గొన్నారు.